ఉపాధి అవకాశాల కల్పనకు నైపుణ్య గణన

విశాలాంధ్ర-జలుమూరు: ఉపాధి అవకాశాల కల్పనకు నైపుణ్య గణన ఎంతో ఉపయోగపడుతుందని జలుమూరు మండల అధ్యక్షులు వాన గోపి అన్నారు. జలుమూరు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం సచివాలయ సిబ్బందికి నిర్వహించిన స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం ఆనందాయకమని అన్నారు. మండల అభివృద్ధి అధికారితో పాటు పంచాయతీ విస్తరణ అధికారి వి.ఉమామహేశ్వరరావు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. కే.అప్పలనాయుడు మాట్లాడుతూ 15 సంవత్సరాల పైబడి 59 సంవత్సరాలలోపు ఉన్నవారికి ప్రతి ఒక్కరికి సర్వే చేపట్టి డేటా సేకరించాలని ఆయన అన్నారు.

ప్రభుత్వ మద్యం షాపులలో సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 3600 ప్రభుత్వ మద్యం షాపులను ఏర్పాటు చేసి, అందులో పలువుర్ని ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలకు తీసుకుందని, ఇప్పుడు వారిని తొలగించడం దారుణం అని, వారికి ఉద్యోగ భద్రత కల్పించి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు చాపర వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం జడ్పీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ ఔట్సోర్సింగ్ ప్రాతిపదికన ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసి ఔట్సోర్సింగ్ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా 15 వేల మందిని ఎంపిక చేయడం జరిగిందని, 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత నూతన మద్యం పాలసీ ప్రైవేటీకరణ చేయడం జరిగిందని, దాని వలన సుమారు 15000 మంది ఉద్యోగాలు కోల్పోయి వారి కుటుంబాలతో సహా రోడ్డున పడడం జరిగిందని కాబట్టి వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వీరందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వనికిస్తున్న సమయంలో కూడా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్టిలో ఉంచుకొని వారి ప్రాణాలు సైతం లెక్కచేయకుండా కష్టపడి పని చేశారని, అలాంటి వారికి ఉద్యోగాలు లేకుండా చేయడం అన్యాయమన్నారు. వారికి బకాయి పడ్డ జీతాలు, బోనస్‌లు కూడా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని వారందరికీ ఉద్యోగ భద్రత కల్పించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్‌లో ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం వారికి ఉద్యోగ అవకాశం కల్పించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. అనంతరం మీ కోసంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు డోల శంకరరావు, ఏఐటీయూసీ నాయకులు చిక్కాల గోవిందరావు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ శ్రీకాకుళం నాయకులు కీర్తి ధర్మారావు, బొత్స సంతోష్, పోగోటి వాసుదేవరావు, బత్తిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కూటమి ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- లండ వెంకట్రావు, చాపర సుందర్ లాల్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: ఎన్నికల హామీల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లండ వెంకట్రావు, జిల్లా నాయకులు చాపర సుందర్ లాల్‌లు కోరారు. ఈ మేరకు సోమవారం మీ కోసంలో వినతిపత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అన్నీ అమలు చేయకుండా దాటవేస్తున్నారని, సంక్షేమ పథకాలపైన ఆధారపడే ఎందరో పేదలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. తల్లికి వందనం పథకం వెంటనే అమలు చేయాలని పిల్లల తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక ఇబ్బందులు గురవుతున్నారన్నారు. బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి ఇస్తామన్న రూ.15 వేలు వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు, ప్రతీ మహిళకు ఇస్తామన్న నెలకు రూ.1500 ఇవ్వాలని, ప్రతి రైతుకు ఏటా ఇస్తామన్న రూ.20 వేలు ఆర్థిక సాయం వెంటనే అమలు చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు మూడు లక్షల నుండి పది లక్షల వరకు ఇవ్వాలని, పేదలకు పశువుల కొనుగోళ్లకు, దాణా ఖర్చులకు నిధులు మంజూరు చేసి పశువులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి పశువుల మేతకు బంజర భూములు కేటాయించాలన్నారు. వ్యవసాయ కూలీలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాయితీలతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఇంటింటికి రక్షిత త్రాగునీటి సౌకర్యంతోపాటు, యువతకు కల్పిస్తామన్న 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కృషిచేసి, నిరుద్యోగ భృతి వెంటనే అమలు చెయ్యాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తుందని రైతులు వాటిని వినియోగించుకోవాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రూరల్ మండలం గేదెలవానిపేటలో సోమవారం రెవెన్యూ గ్రామ సదస్సును ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ భూ సర్వేలో లోపాలు ఉన్నట్లయితే రైతులు దరఖాస్తులు చేసుకోవాలని వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. రీ సర్వేలో పొరపాట్లను సరిదిద్దేందుకే రెవెన్యూ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ చట్టం తెచ్చి భూ యజమానుల నుంచి భూమిని కాజేసేందుకు పన్నాగం చేసిందన్నారు. సమస్యకు సంబంధించి అవసరమైతే ఫీల్డ్‌కి వచ్చి సంబంధిత సమస్య పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

విశాలాంధ్ర - కంచిలి: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతాంగానికి న్యాయం చేయాలని జిల్లా రైతు సంఘం కో కన్వీనర్ ఎ.లోకనాథం, రైతు సంఘ నాయకులు ఎస్.నారాయణస్వామి తదితరులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కంచిలి తహశీల్దార్ రమేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పాలకులు ఇచ్చిన హామీలకు, చేసిన పనులకు ఏ మాత్రం పొంతన లేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏడాదికి 20వేల రూపాయలు చొప్పున పెట్టుబడి సహాయం అందజేస్తామని ఇచ్చిన హామీ తుంగలో తొక్కారని పేర్కొన్నారు. జిల్లాలో వేలాది చెరువులు ఆక్రమణలకు గురైనప్పటికి పట్టించుకునే నాథుడు లేడని వాపోయారు. రానున్న రబీ సీజన్‌లో రైతులు సాగు చేసే పంటలకు బీమా ప్రీమియం ప్రభుత్వం చెల్లించాలని కోరారు.

హోంగార్డు కుమారునికి కారుణ్య నియామకం

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: జిల్లా హోంగార్డ్ యూనిట్‌లో టి.కాంతారావు హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు ఆగస్టు నెలలో మరణించాడు. ఈ మేరకు ఆయన కుమారుడు సత్యనారాయణకు కారుణ్య నియామకం ప్రకారం హోంగార్డుగా నియమిస్తూ నియామక పత్రాన్ని సోమవారం ఉదయం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అందజేశారు. అదేవిధంగా రాష్ట్ర చీఫ్ ఆఫీస్ సెంట్రల్ వెల్ఫేర్ ఫండ్ నుంచి మంజూరైన 40 వేలు రూపాయల నగదు చెక్కును కాంతారావు సతీమణి లక్ష్మీకి జిల్లా ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మరణించిన హెూంగార్డు కాంతారావు కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, సుదీర్ఘ కాలంగా అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మరణించడం బాధాకరమని, ఎటువంటి సమస్య ఉన్న నేరుగా తనను కలవవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మ్ రిజర్వ్ పోలీసు డీఎస్పీ ఎల్.శేషాద్రి, డిపిఓ ఏ.ఓ. సిహెచ్ గోపీనాథ్ పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

విశాలాంధ్ర-నందిగాం: మండలం ప్రతాప విశ్వనాథపురంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసి పలువురిని గాయపరిచింది. అదే విధంగా ఇతర కుక్కలను కరిచి వేసింది. దీంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. తక్షణం పంచాయతీ కార్యదర్శి ధనుంజయకి ఫిర్యాదు చేయగా పై అధికారులకు విషయం తెలియజేసి కుక్కలు గ్రామంలో లేకుండా తగు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

ఆ గ్రామాలకు దారి చూపండి

ఎమ్మెల్యే అశోక్‌కు జాగృతి వినతి

విశాలాంధ్ర - సోంపేట: సోంపేట మండలం గొల్లవూరు పంచాయతీ పరిధిలో దామోదరపురం, కొర్లాం పంచాయతీ లక్ష్మీపురం నుంచి బేసి రామచంద్రాపురం, కంచిలి మండలం బూరగాం జాతీయ రహదారి నుంచి రైల్వే గేటు వరకు గల రహదారులు నిర్మించి ప్రజల ఇబ్బందులు తొలగేలా చేయాలని సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్‌కు కొర్లాం జాగృతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రాంబుడ్డి గణపతి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే అశోక్ సానుకూలంగా స్పందించినందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు రాంబుడ్డి జానకిరావు, సంగారు ఢిల్లేశ్వరరావు, బలరాం పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలను త్వరితంగా పరిష్కరించండి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: మీకోసం (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) అర్జీలు పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యతనివ్వాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) మీకోసం కార్యక్రమం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జరిగింది. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తోపాటు జిల్లా రెవిన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీధర్ రాజు, ఉప కలెక్టర్ అప్పారావు పాల్గొని 204 అర్జీలను వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్ కార్యక్రమంలో మధ్యాహ్నం 12.00 గంటలనుండి 01.00 వరకు మండల స్థాయి కమిటీ సభ్యులు పాల్గొని సంబంధిత సమస్యలు సత్వరం పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన దరఖాస్తులు పూర్తి స్థాయిలో పరిశీలించి పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలన్నారు. రీ ఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీల పరిష్కార తీరు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ కె.భారతీసౌజన్య, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా. బి.మీనాక్షి, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వి.ప్రసాద రావు, బి.సి కార్పొరేషన్ ఇ.డి గెడ్డెమ్మ, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంతి శ్రీ, డ్వామా పి.డి బి.సుధాకర్ రావు, డి.సి.హెచ్.యస్. డా. కళ్యాణబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర అవతరణను మరువటం సిగ్గుచేటు

- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర - ఆమదాలవలస: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం నవంబర్ ఒకటవ తేదీని చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా మరవడం బాధా కరమని మాజీ స్పీకం, వైసీపీ పార్లమెంట్ పరిశీలకులు తమ్మినేని సీతారాం అన్నారు. గత వైసీపీ సర్కార్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పండగ వాతావరణంలో నిర్వహించిందని గుర్తు చేశారు. ప్రస్తుత రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున జిల్లా కేంద్రంలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసేందుకే, నాయకులు కరువయ్యారన్నారు. ఎన్నికల హామీలలో తెల్ల రేషన్‌కార్డుదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అని చెప్పి తీరా ప్రభుత్వం వచ్చాక ఆ పథకానికి తూట్లు పొడిచారన్నారు. రాష్ట్రంలో కోటి 50 లక్షల మంది లబ్ధిదారులకు సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్న ప్రభుత్వం, కేవలం కోటి మందికే పరిమితం చేసిందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. గత నాలుగు నెలల్లో రాష్ట్రంలో ఎక్కడ చూసినా అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. దీపావళి పండుగ కానుకగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై కరెంటు చార్జీల భారం మోపిందన్నారు. 2014-19 సంవత్సరాల కాలంలో చంద్రబాబు నాయకత్వంలో అప్పటి ప్రభుత్వం చేసిన అప్పులు, బకాయిలు కలసి 86,215 కోట్లు అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కరెంటు చార్జీలు పెంపుతో అప్పటి ప్రజానీకం రోడ్లపైకి వచ్చిన విషయాన్ని మరవకూడదన్నారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

- గురుకులాల డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ బాలాజీ నాయక్

విశాలాంధ్ర - ఎచ్చర్ల: తమ ఉద్యోగ జీవితంలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని గురుకులాల డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ బాలాజీ నాయక్ అన్నారు. దుప్పలవలస అంబేద్కర్ గురుకులం లైబ్రేరియన్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన కణితి శ్యామలరావు అభినందన సభను పాఠశాల/ కళాశాల ప్రిన్సిపాల్ బోర బుచ్చిరాజు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ నాయక్ మాట్లాడుతూ విశ్రాంత జీవితం ఆరోగ్యంగా గడపాలని తెలిపారు. ఉద్యోగులు చిత్త శుద్ధితో పని చేసి పలువురి మన్ననలు పొందితే పదవీవిరమణ అనంతరం వాటిని నెమరువేసుకుంటూ జీవితాన్ని ఆనందంగా గడపవచ్చు అన్నారు. ఈ సందర్భంగా జిల్లాల గురుకులాల ఉద్యోగులు శ్యామలరావు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో విజయనగరం పూర్వ డీసివో బి.చంద్రావతి, తూర్పుగోదావరి జిల్లా డిసిఓ జి.వెంకటరావు, కొలివలస ప్రిన్సిపాల్ డి.దేవేంద్రరావు, సబ్బవరం ప్రిన్సిపాల్ ఎన్.రామకృష్ణ, దుప్పలవలస గురుకులం వైస్ ప్రిన్సిపల్ డా:బి.రాంబాబు, పిఎంసి సభ్యులు, కళాశాల సిబ్బంది బంధువులు, పూర్వ విద్యార్థులు, మిత్రులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి

విశాలాంధ్ర - టెక్కలి: 68వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ అండర్-14 పోటీలకు ప్రభు త్వ ఉన్నత పాఠశాల విద్యార్థి పొలందుర్గా మల్లేశ్వరరావు (7వ తరగతి) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి నాగభూషణం తెలిపారు. ఈ సందర్భంగా 6వ తేదీ నుండి 8వ తేదీ వరకు కడప జిల్లా అంగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు శ్రీకాకుళం జిల్లా జట్టు తరపున విద్యార్థి మల్లేశ్వరరావు పాల్గొం టాడన్నారు. విద్యార్థికి రామిరెడ్డి, జగ్గమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

బ్యాంకింగ్ రంగంలో అవకాశాలు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - నరసన్నపేట: బ్యాంకింగ్ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని పోటీ పరీక్షల నిపుణులు ఎం.వి.ఎస్. సంతోష్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ఈ రంగంలో ప్రవేశించిన వారు సామర్థ్యం, అనుభవం ఆధారంగా అత్యున్నత స్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు.

ప్రొబేషనరీ అధికారిగా ఉద్యోగం ప్రారంభించిన వారు సీనియర్ మేనేజర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉందని అన్నారు. జనరల్ అవేర్‌నెస్ కోసం ప్రతీ రోజూ దిన పత్రికలు చదువుతూ ముఖ్యమైన విషయాలను నోట్స్ రూపంలో తయారుచేసుకోవాలని, బ్యాంకింగ్ రంగ నేపథ్యానికి సంబంధించిన నాలెడ్జ్ కోసం ఒక ఫైనాన్షియల్ డైలీని కూడా చదవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్, అకడమిక్ ఇన్‌ఛార్జ్ ముకల్ల శ్రీనివాసరావు, హిస్టరీ అధ్యాపకులు, పద్మనాభం, కె.రాము పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులు పూర్తిస్థాయిలో పరిష్కరించాలి

- జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: ప్రజా ఫిర్యాదులు స్వీకరణ, పరిష్కారం కార్యక్రమంలో వచ్చే ప్రజా ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇస్తూ, చట్ట ప్రకారం పూర్తి స్థాయిలో పరిష్కారానికి చర్యలు చేపట్టి త్వరితగతిన పరిష్కరించాలని, చట్ట పరిధిలో చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ప్రజల నుంచి 65 పిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. నడవలేని వృద్ధులు, వికలాంగుల వద్దకు జిల్లా ఎస్పీ వెళ్లి వారి సమస్యలు తీసుకొని సమస్యలు పట్ల సానుకూలంగా స్పందించి పరిష్కారం చూపిస్తాను అని భరోసా కల్పించారు.

ఆర్మీ జవాన్ల రుణం తీర్చుకోలేనిది

- ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

విశాలాంధ్ర-హిరమండలం: ఆర్మీ జవాన్ల రుణం తీర్చుకోలేనిదని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పాతపట్నం నియోజకవర్గం కేంద్రంలో గల మాజీ ఆర్మీ సైనికుల సంక్షేమ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజుల పరిపాలనలో రాష్ట్రంలో మాజీ సైనికుల సంక్షేమం కోసం 10 కోట్ల రూపాయలతో కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. అలాగే దేశ సరిహద్దులో ఆర్మీ జవాన్లు ఉన్నారనే ధైర్యంతో మనం మన కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండగలుగుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుబేదార్ రామారావు, మాజీ ఆర్మీ సైనికులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో "ప్రజా వారధి"

విశాలాంధ్ర - రణస్థలం: మండల పరిషత్ కార్యాలయంలో ప్రజల నుంచి రెవెన్యూ, హౌసింగ్ బిల్స్, సైట్స్, గ్రామ పంచాయతీ బిల్డింగ్ ప్లాన్, బర్త్ సర్టిఫికెట్, పొల్యూషన్ కంట్రోల్, డ్రింకింగ్ వాటర్ (ఆర్‌డబ్ల్యుఎస్), పీఆర్ కమ్యూనిటీ హాల్, జీపీ ఎంక్రోచ్ మెంట్, ఏపీఈపీడీసీఎల్, సీసీ డ్రైన్, పోలీస్, భూ సమస్యలు అన్ని శాఖలకు సంబంధించి అర్జీలు 160 స్వీకరించారు. అధికారులకు అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేలా అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఎచ్చెర్ల శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పంట బీమా అమలుపై అవగాహన

విశాలాంధ్ర - కవిటి: జీడి పంట బీమా అమలుపై రైతులకు అవగాహన సదస్సు చండిపుట్టుగ, బైరిపురం గ్రామంలలో ఉద్యానవన శాఖ అధికారిణి పి.మాధవిలత ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాధవిలత మాట్లాడుతూ వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద గుర్తింపబడిన జీడి మామిడి పంటకు పంట బీమా చెల్లించటానికి ప్రభుత్వం నుండి ఉత్తర్వులు వెలువడినట్లు తెలిపారు. జీడి రైతులు హెక్టారుకు 4వేలు రూపాయలు, ఎకరాకు 16 వందల రూపాయలు ఈ నెల 15 తేదీ లోగా బీమా ప్రీమియంను మీసేవ కేంద్రాలలో చెల్లించి నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

సీసీ రహదారి పనులు ప్రారంభం

విశాలాంధ్ర - టెక్కలి: పల్లె పండగలో భాగంగా మండలంలో తొలుసురుపల్లి గ్రామంలో సీసీ రహదారి పనులను బీజేపీ మండల అధ్యక్షులు గూన మీనా కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి కార్యక్రమాలు సాధ్యమవుతాయని అన్నారు. పల్లె పండగలో గ్రామాలలో ఉన్న సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడమే దీని ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఎన్నో సంవత్సరాల నుండి రహదారి లేక అనేక ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు ఈ రహదారి నిర్మాణంతో ఆనందం వ్యక్తం చేశారు.

కళాశాలకు వితరణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: ప్రభుత్వ డిగ్రీ కళాశాల పురుషులు శ్రీకాకుళంలో సంస్కృత ప్రధాన అధ్యాపకులు డాక్టర్ వమ్మి రామారావు పదవీ విరమణ చేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ వి.సురేఖ అధ్యక్షత వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వమ్మి రామారావు తన 32 సంవత్సరాల అధ్యాపక జీవితంలో ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది వారి జీవితాన్ని ఉన్నత స్థానాన్ని నిలబెట్టడంలో ఎంతో కృషి చేశారని ప్రశంసించారు. తన ప్రతి నెల తన జీతంలో కొంత భాగం పేద విద్యార్థులకు సహాయం చేశారని వైస్ ప్రిన్సిపాల్ వి.సత్యనారాయణ పేర్కొన్నారు. సంస్కృత విభాగంలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులకు బహుమతి నిమిత్తము 35 వేల రూపాయలు బాండ్‌ను అందజేశారు. దీనిపై వచ్చే వడ్డీతో ప్రతి సంవత్సరం బహుమతి ఇవ్వడం జరుగుతుందని, అదేవిధంగా కళాశాల కొత్త ఫ్యానుల కొనుగోలు నిమిత్తం 15 వేల రూపాయలు చెక్కును అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

శివనామ స్మరణతో మారు మ్రోగిన శివాలయాలు

విశాలాంధ్ర - జలుమూరు : మండల కేంద్రం సారవకోట తో పాటు అంగూరు కోనేరు గట్టుపై ఉన్న కుంభేశ్వర స్వామిని సారవకోట కొండపైనున్న మండలాధీశ్వరుడు కోనేరు పై ఉన్న సోమనాధీశ్వరుడు బుడుతి చీడిపూడి అవలింగి పలు గ్రామాల్లో శివాలయాల్లో కార్తీక మొదటి సోమవారం శివనామ స్మరణతో హోరెత్తాయి. తెల్లవారుజాము నుండే స్వామిని దర్శించేందుకు వందల సంఖ్యలో భక్తులు ఆలయ ప్రాంగణంలో బారులు తీరారు. ప్రత్యేక అభిషేకాలు ప్రత్యేక పూజలు అనే ఆలయాల్లో నిర్వహించారు. కొన్ని ఆలయాల్లో ఆకాశదీపం అద్భుతంగా ఏర్పాటు చేసి ప్రతినిత్యం దానిని వెలిగిస్తూ మహిళలు దర్శనం చేస్తూ ఉండడం ఇక్కడ ఆనవాయితీ వస్తోంది.

నైపుణ్యాభివృద్ధి ప్రోగ్రామ్స్‌పై విద్యార్థులు దృష్టి సారించాలి

అంబేద్కర్ యూనివర్శిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రో.ఉదయ్‌భాస్కర్

విశాలాంధ్ర - నరసన్నపేట : అంబేద్కర్ యూనివర్శిటీ అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి ప్రోగ్రామ్స్‌పై విద్యార్థులు దృష్టి సారించాలని డా.బి.ఆర్.అంబేద్కర్ యూనివర్శిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్. ఎస్.ఉదయ్‌భాస్కర్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ, వి.జి కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్స్‌ను ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రొఫెసర్, ఉదయ్‌భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నూతన విద్యా విధానం-2020 ప్రకారం డిజీలాకర్ విధానం ద్వారా విద్యార్థులు ధృవీకరణ పత్రంలో ఆన్‌లైన్ విధానంలో అందుబాటులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కళాశాలలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులతో పాటు యు.జిలో ఆనర్సు కోర్సులు ప్రవేశపెట్టాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్. డా.పి.లత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు దూరభారం లేకుండా ఉన్నత విద్య అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు, డా.గొలివి మోహనరావు, వైస్ ఎంపిపి ప్రతినిధి, పాగోటి రాజారావు, వూణ్ణ రంగారావుతో పాటు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా హ్యూమన్ కంప్యూటర్ 'శకుంతలాదేవి' జన్మదినం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్, డా.పి.లత ఆధ్వర్యంలో హ్యూమన్ కంప్యూటర్, హ్యూమన్ కాలిక్యులేటర్, శకుంతలాదేవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డా.లత మాట్లాడుతూ చిన్న వయస్సు నుండి సాధన ద్వారా గణితంలో అత్యున్నత స్థాయికి ఎదిగారని, 13అంకెల సంఖ్యను మరో 13అంకెల సంఖ్యలో గుణకారం ద్వారా విలువలు క్షణాల్లో చెప్పగలగటం ద్వారా గిన్నీస్ ఆఫ్ బుక్ రికార్డు సాధించారని ఆమె సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గణితశాస్త్ర అధ్యాపకులు, వై.రాంబాబు, కళాశాల అధ్యాపక సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎండల మల్లన్న ఉత్సవాలలో పోటెత్తిన భక్తులు....

విశాలాంధ్ర - టెక్కలి : కార్తీక మాస మొదటి సోమవారం సందర్భంగా రావివలస గ్రామంలో వెలిసినటువంటి శ్రీశ్రీశ్రీ ఎండల మల్లికార్జున స్వామి ఆలయంలో తెల్లవారి జాము నుండి దేవాదయ శాఖ అధికారి గురునాధరావు ఆధ్వర్యంలో ఎండల మల్లన్న ఉత్సవాలు ఘనంగా జరిగాయి. వేకువజాము నుండి శ్రీకాకుళం జిల్లా నలుమూలల నుండి మల్లన్నను దర్శించుటకు భక్తులు పోటెత్తారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను సక్రమంగా అధికారులు నిర్వహించారు. ట్రాఫిక్కు ఎలాంటి అంతరాయం కలగకుండా పోలీస్ సిబ్బంది వాహనాలు గ్రామ ముందర భాగంలో నిలిపివేసి వాటిని పార్కింగ్ స్థలాలలో ఏర్పాటు చేశారు. భక్తులకు ఉచిత ప్రసాదం, వైద్య శిబిరాన్ని దేవాదాయ శాఖ అధికారులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

మల్లన్న ఆలయాన్ని పరిశీలించిన డివిజనల్ రెవెన్యూ అధికారి: ఎం. కృష్ణమూర్తి....

మండలంలో రావివలస గ్రామంలో వెలిసినటువంటి శ్రీశ్రీశ్రీ ఎండల మల్లికార్జున స్వామి ఉత్సవాలను సోమవారం రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం కృష్ణమూర్తి పరిశీలించారు. ముందుగా ఎండల మల్లన్న ను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు ను దేవాదాయ శాఖ అధికారి గురునాధరావు ని అడిగి తెలుసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో త్రాగునీరు పారిశుధ్యం తదితర ప్రాంతాలను పరిశీలించారు. భక్తుల కోసం ఏర్పాటుచేసిన ఉచిత ప్రసాదం, మజ్జిగ పరిశీలించి, ఆయన చేతులు మీదగా పంపిణీ చేశారు. ఆలయంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని పరిశీలించి వైద్య సిబ్బందితో మాట్లాడారు. ట్రాఫిక్కు ఎలాంటి అంతరాయాలు కలగకుండా, ఎక్కడి ఎలాంటి సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఆయనతోపాటు దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ అర్చకులు,ఎల్.ఎల్ నాయుడు, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి అనపాన జనార్ధన రెడ్డి, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం పోస్టాఫీసు వద్ద ఖాతాదారుల ఆందోళన

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : మండలంలోని ధర్మవరం పోస్టాఫీసులో పొదుపు చేసిన డబ్బులు స్వాహా అయినట్టు గ్రామానికి చెందిన ఖాతాదారులు సోమవారం పోస్టాఫీసు ఎదుట ఆందోళన చేపట్టారు. ఖాతాదారులు తెలిపిన వివరాల ప్రకారం రికరింగ్ డిపాజిట్ (ఆర్డీలు), ఇతర పొదుపు మొత్తాలను స్థానిక పోస్టాఫీసులో దాచుకున్నామని పేర్కొన్నారు. గత మూడేళ్లుగా ఆమె బీపీఎంగా పనిచేస్తు ఇటీవల మృతిచెందింది. అయితే ఈమె ఖాతాదారుల నుంచి పొదుపు చేసిన మొత్తానికి సంబంధించి పుస్తకాలు ఖాతాదారు లకు ఇవ్వకుండా తన వద్దే ఉంచుకున్నట్టు ఖాతాదారులు చెబుతున్నారు. దీంతో కొంతమంది ఖాతాదారులు పోస్టాఫీసును రెండు రోజుల క్రితం సంప్రదించారు. అయితే పొదుపు చేసిన మొత్తం పోస్టాఫీసు పుస్తకాల్లో జమకాలేదని తెలిసి తామంతా మోసం పోయినట్టు ఖాతాదారులు గుర్తించారు. ఇలా చాలా మంది ఖాతాదారులు నష్టపోయినట్టు భావించి.. పోస్టల్ అధికారులకు ఫిర్యాదుచేశారు. దీంతో సోమవారం పోస్టల్ శాఖకు చెందిన నలుగురు సిబ్బంది ధర్మవరం పోస్టాఫీసును సందర్శించి క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఖాతాదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సుమారు రూ.15 నుంచి 20 లక్షల వరకు మోసపోయినట్టు ఖాతాదారులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. తాము పొదుపుచేసిన డబ్బులను తిరిగి చెల్లించాలని బాధిత ఖాతాదారులు డిమాండ్ చేస్తున్నారు.

శ్రీ సూర్యనారాయణ స్వామి వారి హంసనావికోత్సవము (తెప్పోత్సవం)

విశాలాంధ్ర - అరసవల్లి : అరసవల్లి నందు వేంచేసి యున్న శ్రీ సూర్యనారాయణ స్వామి వారి హంసనావికోత్సవము తెప్పోత్సవం సందర్భముగా ఈ నెల 13వ తేది (క్షీరాబ్ధి ద్వాదశి) బుధవారం సాయంత్రం 4 గంటల నుండి 7 గంటల వరకు అత్యంత వైభవముగా జరపబడుతుందని, సదరు తెప్పోత్సవం సందర్భంగా ఎదురుగా గల ఇంద్రపుష్కరిణి (కోనేరు)లో శ్రీ స్వామి వారిని దేవేరులతో సహా హంసవాహనం పై ఊరేగింపు కార్యక్రమం జరుగనుందని అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి దేవస్థానం ఉప కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి యర్రంశెట్టి భద్రాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జేబీటీ పాఠశాల ఆధ్వర్యంలో నాగుల చవితి పర్వదినానికి స్వాగతం

విశాలాంధ్ర - జలుమూరు : మంగళవారం జరగబోవు నాగుల చవితి పర్వదిన సందర్భంగా సారవకోట మండలం అవలింగి జేబిటి పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు రంగురంగులతో నాగ సర్పం చిత్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిని పలువురు తిలకించి ఆనంద వ్యక్తపరిచారు. విద్యార్థుల్లో ఇటువంటి పర్వదినాలపై చైతన్యం ఉండడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. వీరందరికీ పాఠశాల వ్యవసా ్థపకులు జోగుమహంతి మోహన్ గాంధీ అభినందనలు తెలిపారు.

పుణ్యక్షేత్రం శ్రీముఖలింగంలో భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ

విశాలాంధ్ర - జలుమూరు : ప్రముఖ పుణ్యక్షేత్రం జలుమూరు మండలం శ్రీముఖలింగం లో కొలువై ఉన్న మధుకేశ్వర స్వామి ఆలయానికి దర్శించడానికి వచ్చిన భక్తులకు ఆలయం తరుపున ఉచిత ప్రసాదాన్ని పంపిణీ చేశారు. క్యూలైన్‌లో ఉన్నవారికి ఆలయ ప్రాంగణంలో ఉన్న భక్తులకు ఈ ప్రసాదాన్ని అందజేశారు. కార్య నిర్వహణ అధికారి పి.ప్రభాకర్ రావు, ఆలయ ప్రధాన అర్చకులు శేషాద్రి వెంకటాచలం, పలువుర అర్చకులు స్థానికులు పాల్గొన్నారు.

వర్సిటీ అధ్యాపకులకు అదనపు బాధ్యతలు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో పలువురు అధ్యాపకులకు అదనపు బాధ్య తలు అప్పగించారు. బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.లోకేశ్వరికి ఎగ్జామ్ (కాన్ఫిడెన్షియల్) డీన్గా, డాక్టర్ జి.రామకృష్ణ (కంప్యూటర్ సైన్స్)కు వర్సిటీ వెబ్సైట్ సమన్వయకర్తగా, డాక్టర్ జి.ప్రకాశ్బాబు (కామర్స్ అండ్ మేనేజ్మెంటు)కు స్వర్ణాంధ్ర -2047 వర్సిటీ సవ సన్వయకర్తగా, డాక్టర్ ఎం.సుష్మారెడ్డి (ఫిజిక్స్) మూక్స్ సమన్వ యకర్తగా, ఎ.గణేష్‌బాబు (ఇంజనీరింగ్ ఫిజిక్స్) స్వయం సవన్వయకర్తగా నియమించారు. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రాలను వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని చేతుల మీదుగా అందజేశారు. ఎస్వీ డాక్టర్ కె.సామ్రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

మినప విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర - నందిగాం : ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల తెదేపా అధ్యక్షుడు పినకాల అజయ్ కుమార్ అన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద మండల వ్యవసాయ అధికారి పెయ్యిల శ్రీకాంత్ వర్మ నేతృత్వంలో అపరాల పంటలైన వేరుసెనగ, పెసర, మినుము విత్తన పంపిణీ కార్యక్రమం సోమవారం మొదలుపెట్టారు. పలువురు రైతులకు విత్తనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్ల బాలకృష్ణ, పోలాకి చంద్రశేఖర రావు, సబ్బి జానకిరామ్ పాల్గొన్నారు.

రబీ వేరుశనగ పంటకు విత్తనాలు సిద్ధం

విశాలాంధ్ర - శ్రీకాకుళం : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో ఈ ఏడాదిలో రబీలో పంట సాగు చేసే రైతుల కోసం సబ్సిడీ వేరుశనగ విత్తనాలు సిద్ధం చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి కె. త్రినాధ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సీజనుకు గాను రైతు సేవా కేంద్రాలలో అధిక దిగుబడి నిచ్చే వేరుశనగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. ఈ సీజనుకు అనువైన కె-6, జీసీజీఎస్ 1694 (విశిష్ట) అనే రకాల విత్తనాలు సరఫరా చేయడం కోసం ఒక కిలో విత్తనానికి పూర్తి ధర రూ.98 నిర్ణయించినట్లు, అందులో 40 శాతం రాయితీ (రూ.38-40లు) పోను, రైతు చెల్లించవలసింది రూ.57-60 గా ఉన్నట్లు స్పష్టం చేశారు. జిల్లాకు సంబంధించి 4533 క్వింటాళ్లు వేరుశనగ విత్తనాలు కేటాయించడమైనదని, ఇందులో భాగంగా 4518 క్వింటాళ్లు రైతు సేవ కేంద్రాల పరిధిలో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. విత్తనాలు కావలసిన రైతులు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని కోరారు. జిల్లాకు సంబంధించి 4533 క్వింటాళ్ల వేరుశనగ విత్తనములు రూ.1,73,50,272 రాయితీతో సరఫరాకు సిద్ధం చేసామని విస్తీర్ణం పెరిగే అవకాశం ఉన్నందున జిల్లాకు అదనంగా మరో 2000 క్వింటాళ్లు కేటాయించమని ప్రతిపాదనలు (సుమారు రాయితీ రూ.76 లక్షలుతో) పంపించినట్లు తెలిపారు. నీటి సదుపాయం వున్న ప్రాంతాలలో రైతులు వ్యవసాయ శాఖ అధికార్ల సలహాలు తీసుకొని అన్ని యాజమాన్య పద్ధతులు పాటిస్తూ వేరుశనగ పంటలో సాగు చేసి అధిక దిగుబడి సాధించాలని అన్నారు.

మత్స్యకారులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

చేప పిల్లలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : వలసలు నివారించి మత్స్యకారుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రూరల్ మండలం సింగుపురం పంచాయతీ మామిడివలసలో ఎమ్మెల్యే గొండు శంకర్ సోమవారం చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి 100 శాతం రాయితీపై చేపలను పంపిణీ చేస్తున్నట్టు వివరించారు. స్వదేశీ మత్స్య సహకార సంఘాలకు, పి ఎం ఎం ఎస్ వై సంఘాలకు ఈ చేప పిల్లలను పంపిణీ చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో మత్స్యకారులను ఆదుకునేందుకు అనేక సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు ఎమ్మెల్యే శంకర్ వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు గ్రామస్తులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రం శ్రీముఖలింగంలో తగ్గిన భక్తుల తాకిడి

విశాలాంధ్ర - జలుమూరు : ప్రముఖ పుణ్యక్షేత్రం జలుమూరు మండలం శ్రీముఖలింగం లో కొలువైయున్న శ్రీమద్కేశ్వర స్వామికి కార్తీక మాసం మొదటి సోమవారం భక్తులు రద్దీ తగ్గిందని స్థానికులు అంటున్నారు. గత ఏడాదికి పోలిస్తే ఈ ఏడాది మొదటివారం భక్తులు తక్కువ అని స్థానికులు అంటున్నారు. తెల్లవారుజామున ఆలయ ప్రధాన ధర్మకర్తలు పర్లాకిమిడి మహారాజు గజపతి పేరున మొదట పూజ ప్రారంభమైంది. అనంతరం జిల్లా నలుమూలల నుండి భక్తులు స్వామిని దర్శించేందుకు వచ్చారు. మొదటి సోమవారం అనుకున్నంత భక్తులు లేదని అర్చకులు వాపోయారు. వచ్చినవారే స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి పి ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు శేషాద్రి చలం పలువురార్చకులు సహకారంతో కార్యక్రమం జరిగింది. ఆలయ ప్రాంగణం ఆలయపైన ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణ అన్ని ప్రాంతాల భక్తులకు ఆకట్టుకుంది.

అక్రమ మద్యం అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవు

ఎక్సైజ్ సిఐ మీరాసాహెబ్

విశాలాంధ్ర - టెక్కలి : రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మద్యం దుకాణాలలో అమ్మకాలు జరపాలని ఎక్సైజ్ సిఐ మీరాసాహెబ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్ణయించిన దుకాణాలలో మద్యం ధరలు ఎమ్మార్పీ రేట్లు పట్టికన ఎక్సైజ్ అధికారులు ఆధ్వర్యంలో అతికించారు. టెక్కలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల టెక్కలి, మెలియాపుట్టి, నందిగాం పరిధిలో 11 మద్యం దుకాణాలలో మాత్రమే మద్యం అమ్మకాలు జరగాలని, అక్రమ అమ్మకాలు జరిపితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని సీఐ తెలిపారు. ఒకరికి కేవలం 3 మద్యం సీసాలు మాత్రమే అమ్మకం చేయాలని అన్నారు. ఇరవై ఒక్క సంవత్సరాల మైనర్ బాలలకు మద్యం అమ్మరాదని తెలియజేశారు.

రోడ్డు భద్రతపై గ్రామస్తులకు అవగాహన : సీఐ విజయ్‌కుమార్

విశాలాంధ్ర - టెక్కలి : పోలీస్ అమర వీరుల వారోత్సవాలలో భాగంగా మండలం లో బన్నువాడ గ్రామంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని గ్రామస్తులతో సోమవారం సీఐ అంబటి విజయ్ కుమార్ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో రోడ్డు భద్రతలు పాటించక పోవడంతో ఈ మధ్యకాలంలో రోడ్డు ప్రమాదాలతో అనేక మంది మృతి చెందుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతలు పాటించాలని, వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్ బాలులకు వాహనాలు ఇవ్వరాదని తెలిపారు. అలాగే చైన్స్ స్నాచింగ్, సైబర్ మోసాలు ఈమధ్య ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. ఇలా మరికొన్ని వాటిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

శివాలయాల వద్ద బారులు తీరిన భక్తులు

విశాలాంధ్ర - నందిగాం : మండలంలోని నందిగాం పెంటూరు, కవిటి అగ్రహారం, కొత్త అగ్రహారం, బెజ్జిపల్లి, పెదతామరాపల్లి, సైలాడ, నర్సిపురం, లకిదాసుపురం, దిమలాడ, హర్షబడ, కాపు తెంబూరు, నౌగాం, కల్లాడ, దిమ్మిడిజోల, హరిదాసు పురం, శివాలయాల్లో కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని శివునికి అభిషేకాలు చేశారు.

నెల నెలా జీతాల ఆలస్యం ఉపాధ్యాయులకే ఎందుకు...!

విశాలాంధ్ర - ఆమదాలవలస : ఉపాధ్యాయుల జీత భత్యాల చెల్లింపు అన్ని విభాగాల డిపార్ట్మెంట్ల ఉద్యోగులతో సమానం గా ఒకే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా జరగడం లేదు, రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల జీతాల చెల్లింపు విధానంలో ముందుగా ప్రభుత్వం లోని అన్ని విభాగాలకు జీతాలు చెల్లించిన తరువాతనే ఉపాధ్యాయులకు సంబంధిం చిన జీతాలు చెల్లింపు ప్రక్రియ చేపడుతోంది. ఇది సరైన విధానం కాదని, గత ప్రభుత్వం కూడా ఇలాగే ఉపాధ్యాయులకు అందరికీ జీతాలు చెల్లించిన తర్వాత జీతాలు చెల్లించే దని, ఉపాధ్యాయులు రెండవ శ్రేణి ఉద్యోగు లు కాదని గుర్తు ఎరగాలని పలువురు ఉపా ధ్యాయ సంఘ నాయకులు పెన్షనర్లు వాపో తున్నారు. పెన్షన్ల చెల్లింపు కూడా అందరితో పాటు సమానంగా ఉపాధ్యాయ పెన్షనర్లకు అందడం లేదు. ఉపాధ్యాయుల జీతాలను కూడా చెల్లించేలా విధానాన్ని మార్చుకోవాల ని లేదంటే బ్యాంక్ లోన్లు, ఈ ఎం ఐ లు సకా లంలో చెల్లించలేక పోవడం వల్ల బ్యాంక్ శిబి లింగ్ స్కోర్ పడిపోతుందని ఉపాధ్యాయ వర్గం వాపోతోంది. భీమ క్లైములు చెల్లించాలి... అలాగే ఉద్యోగ ఉపాధ్యాయులు ప్రభుత్వ బీమా సంస్థ ఏపీ జి ఎల్ ఐ మరియు ప్రావి డెంట్ ఫండ్ లో దాచుకున్న పొదుపు చేసు కున్న సొమ్మును అత్యవసరాలకు ఉపయో గించుకునే క్రమంలో లోన్లు పెట్టుకున్న సంద ర్భంలోనూ లేదా పదవీ విరమణ చెందిన సందర్భంలోనూ వారికి చెల్లించాల్సిన పేమెం ట్ల విషయంలో ప్రావిడెంట్ ఫండ్ అయితే జూలై 2022 నుండి చెల్లించలేదని ప్రభుత్వ బీమా సంస్థ క్లెయిమ్స్ చెల్లింపులు అయితే 18 మాసాలుగా చెల్లింపు ప్రక్రియ ఆగిపోయిం దని, 2018, 2019 సంబంధించిన డీఏ అరి యర్లు సిపిఎస్ వారికి క్యాష్ రూపంలో చెల్లిం చాల్సి ఉండగా ఆ సంగతి మరిచిపోయారని ఈ ప్రభుత్వమైనా ఉద్యోగుల సంక్షేమాన్ని మర వకుండా ఉద్యోగులకు చెల్లించాల్సిన పాత బకాయిలన్నీ వెంటనే చెల్లించేలా చర్య లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ వైఖ రిపై గురువులు గుర్రుగా ఉన్నట్లు తెలుస్తుంది. 12వ పిఆర్సి లో న్యాయం చేయాలి... అలాగే ఈ రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యా యులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న 12 వ పిఆర్సి కు సంబంధించిన మధ్యంతర భృతిని రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా సంఘాలతో చర్చించి ప్రకటించాల్సిన అత్య యిక పరిస్థితి నేడు నెలకొని ఉందని,గత ప్రభుత్వం హయంలో ఉద్యోగ ఉపాధ్యా యులకు 11వ పిఆర్సి రూపంలో రివర్స్ లో చేదు గుళిక అందిందని దీన్ని దృష్టిలో ఉంచు కొని 12వ పిఆర్సి విషయంలో ఈ ప్రభుత్వం రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యా యం చేయాలని ఆశిస్తున్నారు. పి ఆర్ సి చైర్మన్ ని నియమించాలి... 2023 జూలై 12 న గత ప్రభుత్వం ప్రకటించి న వేతన సవరణ సంఘం కొనసాగుతుం దా...లేదా అన్న సందేహం ఉద్యోగుల్లో వ్యక్త మవుతోంది. ఎందుకంటే 12 వ వేతన సవర ణ సంఘం చైర్మన్ గా నియామకం పొందిన విశ్రాంత ఐఏఎస్ అధికారి మన్మోహన్ సింగ్ రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత బాధ్యతల నుంచి తప్పుకున్న తర్వాత ఇంత వరకూ కూటమి ప్రభుత్వం నేటికీ మరో అధి కారిని నియమించక పోవడం దీనికి కారణం. 11 వ వేతన సవరణ కాలం గతేడాది జూన్ నెలాఖరికే ముగియగా నవంబర్ 2024 నా టికి 17 నెలలు కావస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కొత్త చైర్మన్ గా ఎవరినీ నియమించక పోవ డం మధ్యంతర భృతి చెల్లించక పోవడంపై ఉద్యో గ ఉపాధ్యాయ వర్గం కూటమి ప్రభు త్వంపై తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. వాస్తవా నికి 15 వ పి ఆర్ సి కాలంలో 12 వ పి ఆర్ సి డి మాండ్ చేస్తున్న పరిస్థితికి కారణం గతంలో నూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పు డు సుమారు రెండున్నర పి ఆర్ సి ల కాలం హరించి వేయడం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగు లకు తీవ్ర ఆందోళన కలిగిస్తుంది. ప్రభుత్వాలు మారుతున్నా పరిస్థితులు మారడం లేదని వాపోతున్నారు..